ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 4 మార్చి 2024



చిన్నారికి పోలియో చుక్కల మందు వేస్తున్న కలెక్టర్ విజయరామరాజు

అంగట్లో సరుకుల్లా.. ఇంటిస్థలాల అమ్మకం

- కడపలో రెవెన్యూ సిబ్బంది బరితెగింపు
- ఆచారి కాలనీ, వైఎస్ఆర్ లేఅవుట్‌లో స్థలాల అమ్మకం
- ఒక్కో ప్లాట్ రూ.1.50 నుంచి రూ.2 లక్షలకు విక్రయం
- డబ్బులిస్తే చాలు ఉద్యోగులైనా సరే వారి పేరుమీద పట్టాలు
- చక్రం తిప్పుతున్న రెవెన్యూలో ఓ కీలక అధికారి, మరో వీఆర్వో



(కడప-ఆంధ్రజ్యోతి): ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్న సామెత ఉంది. కడప తహసీల్దారు కార్యాలయంలో కీలకంగా పనిచేసిన ఓ అధికారి ఆ శాఖ సిబ్బంది కళ్ల ముందే అడ్డగోలుగా కోట్లాది రూపాయలు సంపాదించారు. అందుకేనేమో ఆ శాఖలో సారు అక్రమార్జనను చూసుకుని దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న కాన్సెప్ట్‌ను ఫాలో అయి సిబ్బంది కూడా అక్రమాలకు తెరలేపారంటారు. 'కీలక అధికారి చేసే ఘరానా మోసాలు, దందాలు మాకు తెలుసు. మేం చేసే అక్రమాలను అడిగితే, మేం చేస్తే వ్యభిచారం.. నీవు చేస్తే సంసారమా అంటూ అడిగే సత్తా' కూడా వారికి ఉండడంతో ఆ అధికారి కూడా తన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు కిందిస్థాయి సిబ్బంది చేసే దోపిడీలను పట్టించుకోవడం లేదంటారు. ఇదే అదనుగా కొందరు సిబ్బంది భారీ అక్రమాలకు తెరలేపడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పేదలకు ఇచ్చిన స్థలాలను బ్రోకర్ల ద్వారా అమ్ముకోవడం విమర్శలకు తావిస్తోంది. సకాలంలో వర్షాలు కురవక సాగు చేసిన పంటలకు కనీసం పెట్టుబడి రాక పంటలు ఎండిపోయి అప్పులపాలై రైతులు నష్టపోయారు. పిల్లల చదువుకోకపోతే భవిష్యత్తు పాడవుతుందని పట్టణాలకు వలస వచ్చారు. అందులో భాగంగా కడప జిల్లాతో పాటు ఉమ్మడి కడపకు చెందిన రైతు శ్రామికులు ఇక్కడకు వచ్చారు. పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

స్థలాలకు డిమాండ్

మా జీవితం ఎలాగూ దెబ్బతింది. కనీసం మా పిల్లలకైనా మంచి జీవితం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో పలువురు తల్లిదండ్రులు ఉన్న ఊరిని వదిలేసి బేల్దారి, కూలీ పనులు ఇతరాలు చేసేందుకు కడప నగరానికి వచ్చారు. వీరంతా శివారు ప్రాంతాల్లో అద్దెగృహాల్లో ఉంటున్నారు. 25 ఏళ్లక్రితమే సొంత ఊరును వదిలేసి కడుపుకు అన్నం పెట్టే కడప శివారు ప్రాంతాల్లో సెటిల్ అయ్యారు.

అమ్మకానికి స్థలాలు

కడపలో సొంతిల్లు లేక అద్దె గృహాల్లో ఇబ్బందులు పడుతున్నాం. పేదల కోసం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇందిరమ్మకాలనీ పేరిట ఇంటిస్థలాలు, పక్కాగృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. లేఅవుట్లు వేసి పట్టణ పేదలకు స్థలాలు కేటాయించారు. అప్పట్లో వైఎస్ఆర్ లే అవుట్, ఆచారి కాలనీలు కూడా ఏర్పడ్డాయి. దివంగత వైఎస్ సీఎంగా పనిచేసేనాటికి అప్పటి ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్లు కడప నగరానికి దూరంగా ఉండేవి. లేఅవుట్లలో పేదలకే స్థలాలు వచ్చాయి. అయితే అప్పట్లో పేదలున్న చోటకు స్థలాలు ఉన్న చోటకు పొంతన లేకుండా పోయింది. అప్పట్లో ఆజాద్‌నగర్, వైఎస్ఆర్ లేఅవుట్, మామిళ్లపల్లె మరికొన్ని లేఅవుట్లతో పాటు సింగపూర్‌సిటీకి శ్రీకారం చుట్టారు. ఆయా చోట్ల పేదలకు స్థలాలు ఇచ్చారు. కూలినాలీ చేసే పేదలకు సుదూర ప్రాంతాల్లో స్థలాలు ఇవ్వడంతో అప్పట్లో ఇంటి నిర్మాణాలకు ముందుకు రాలేదు

అమ్ముకో నా రాజా

అప్పట్లో వైఎస్ హయాంలో చాలా మంది పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చారు. అవి అప్పట్లో ఊరికి దూరంగా ఉండడంతో అక్కడ ఇళ్లు కట్టేందుకు ముందుకు రాలేదు. అయితే ఇప్పుడు ఆ స్థలాలు సిటీకి దగ్గరలో ఉన్నాయి. అంతే అక్కడ ఖాళీగా ఉన్న స్థలాలపై కడప రెవెన్యూకు చెందిన ఓ ఇద్దరు కన్నేశారు. లేఅవుట్లలో ఏపే ప్లాట్లలో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి ఓ వీఆర్వో ఇంకా రెవెన్యూలో ఓ కీలక అధికారి అమ్మకాలు చేపట్టినట్లు చెబుతారు. ఆచారికాలనీ, వైఎస్ఆర్ లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న ప్రాంతాలను రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల వరకు బ్రోకర్ల ద్వారా అమ్ముతున్నట్లు చెబుతున్నారు. ఇక్కడ ప్రస్తుతం స్థలాలకు మంచి గిరాకీ ఉంది. సాక్షాత్తు ఓ వీఆర్వో, రెవెన్యూలో ఓ కీలక అధికారి మీ పేరు పైనే పట్టాల పేర్లు ఇస్తాం అని చెబుతుండడంతో కొందరు అడ్డగోలుగా నమ్మేస్తున్నారు. రెవెన్యూ నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టేసి ఆ ఇద్దరూ అమ్ముకుంటున్నట్లు చెబుతున్నారు. ఆచారి కాలనీలో రూ.1.50 కోట్లు, వైఎస్ఆర్ లేఅవుట్లలో రూ.2 కోట్ల ఇంటిస్థలాలను ఓ వీఆర్వో, ఓ రెవెన్యూ అధికారి అమ్మకోవడం హాట్‌టాపిక్‌గా మారింది.



వైఎస్ఆర్ లేఅవుట్‌లోని అమ్మకానికి ఉన్న స్థలం

పోలియోరహిత సమాజం నిర్మిద్దాం : కలెక్టర్

కడప(కలెక్టరేట్), మార్చి 3: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ విజయరామరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం కడపలోని గాంధీనగర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రంలో చిన్నారులకు కలెక్టర్ పోలియో చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు నగర కమిషనరు సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ఆర్డీవో మధుసూదన్, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, డీఐఓ డాక్టర్ ఉమమహేశ్వర్‌కుమార్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు హాజరై చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆదివారం పోలియో కార్యక్రమం జరుగుతోందని, ఇందులో భాగంగా కడప జిల్లాలో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం 0-5 ఏళ్లలోపు చిన్నారులు జిల్లాలో 2,28,131 మంది ఉన్నారని, వీరిలో ఏ ఒక్కరికీ మిస్ కాకుండా పోలియో చుక్కల మందు వేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి చిన్నారికీ పోలియో టీకా మందు అందేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

- లారీల్లో తరలిస్తున్న మాఫియా
- రాత్రివేళల్లో సాగుతున్న దందా
- నిద్రపోతున్న అధికార యంత్రాంగం



జమ్మలమడుగు పాతబస్టాండు మీదుగా లారీలో తరలివెళుతున్న రేషన్ బియ్యం

జమ్మలమడుగు, మార్చి 3: అక్రమ రేషన్ బియ్యం దందాకు జమ్మలమడుగు కేంద్ర బిందువుగా మారింది. రాత్రివేళల్లో లారీల్లో తరలిస్తూ మూడు పువ్వులు.. ఆరు కాయలుగా ఈ దందా సాగిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన అనేక మంది నేతలు ఈ అక్రమ రేషన్ బియ్యం దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని నలుమూలల నుంచి రేషన్ బియ్యం, డీలర్ల వద్ద నుంచి ఒక మిల్లు వద్దకు చేరుతున్నట్లుగా సమాచారం.

కోవెలకుంట్ల రోడ్డులోని సాయిబాబా ఆలయం సమీపాన పొలాల్లో ఓ ఇంటి వద్ద నుంచి అలాగే మోరగుడి, పెద్దపసుపుల మోటు, వద్దిరాల, మైలవరం, వేపరాల, దొమ్మరనంద్యాల, ముద్దనూరు, కోవెలకుంట్ల వైపు నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారు. ఆటోలలో, ద్విచక్ర వాహనాల్లో తెచ్చి జమ్మలమడుగులో విక్రయిస్తున్నారు. రేషన్ డీలర్లు నేరుగా లబ్ధిదారుల వద్ద వేలిముద్రలు వేయించుకొని తక్కువ తూకాలు ఇచ్చి ప్రజలను ఒకవైపు మోసం చేస్తుంటే.. మరికొందరు, వేలిముద్రలు వేయించుకుని అక్కడే తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ బియ్యాన్ని నేరుగా మిల్లులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. తయారు చేసిన బియ్యాన్ని ప్రతిరోజు లారీల్లో రాత్రి సమయంలో జమ్మలమడుగు పట్టణం నుంచి కర్ణాటక ప్రాంతానికి తరలిపోతున్నట్లుగా తెలుస్తోంది. ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని కొందరు డీలర్లు వ్యాపారుల అవతారమెత్తి రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నారు. మరికొందరు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో గ్రామాలకు వెళ్లి తక్కువ ధరకు కొనుగోలు చేసి జమ్మలమడుగులో విక్రయిస్తున్నారు. వాటిని పబ్లిక్‌గా లారీల్లో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. అయితే పోలీసుస్టేషన్ ఎదురుగా, రెవెన్యూ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం తదితర కార్యాలయాల ముందు నుంచే నంబరు ప్లేటు లేకుండా లారీలో రేషన్ బియ్యం తరలిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వాహనాలు ప్రతిరోజు రాత్రి 8.30 నుంచి 10 గంటలలోపు బయల్దేరి వెళతాయని సమాచారం.

ఈ సమస్యకు సంబంధించి జమ్మలమడుగు తహసీల్దారు కరుణాకరను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆయన ఫోన్‌లో స్పందించలేదు. వాట్సాప్ ద్వారా తహసీల్దారుకు మెసేజ్ పంపినా రిప్లయ్ ఇవ్వలేదు. ఇదే విషయంపై ఆర్ఐ రోహిత్‌ను వివరణ కోరగా.. రాత్రిపూట తరలిపోయే బియ్యంపై తమ సిబ్బందిని ఏర్పాటు చేసుకొని నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంపీకి రూ.95 లక్షలు, ఎమ్మెల్యేకు రూ.40 లక్షలు

- ఎన్నికల వ్యయ నియమావళిని ఖచ్చితంగా పాటించాలి
- కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 3: రానున్న సాధారణ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో త్వరలో జరగ నున్న సాధారణ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయంపై నిర్వహించే రికార్డులు, అకౌంట్స్, ఎంసీసీ, సువిద, సి-విజిల్ లాంటి వివిధ ఐటీ అప్లికేషన్స్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ విజయరామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు ఎంపీగా పోటీ చేయు అభ్యర్థికి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.40 లక్షలు ఖర్చు మించరాదన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసే ముందుగానే సపరేట్‌గా బ్యాంకు ఖాతాను తెరవాలన్నారు. నామినేషన్‌వేసిన రోజు నుంచి డిక్లరేషన్ వరకు ఎన్నికల ఖర్చును సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేసి నిర్ణీత సమయంలో వ్యయ అధికారులకు చూపించాలన్నారు. అభ్యర్థుల ఖర్చుపై షాడో రిజిస్టర్లను నిర్వహిస్తుంటారని, అభ్యర్థి నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా చదివి జాగ్రత్తగా పూరించాలన్నారు. ప్రచారానికి స్టార్ క్యాంపెయినర్లు వచ్చేలా ఉంటే ముందుగానే సీఈవో నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. అభ్యర్థి ప్రచారానికి కూడా సువిద యాప్‌లో అప్‌లోడ్ చేసి అనుమతి తీసుకోవాలని, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను సి-విజిల్ యాప్ ద్వారా తెలియజేయాలన్నారు. అభ్యర్థులు తమ సోషల్ మీడియా ఐడీలను ఇవ్వాలని, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకొనే అభ్యర్థులు సంబంధిత ప్రకటనపై మూడు రోజుల ముందుగానే ఎంసీఎంసీ అనుమతి తీసుకోవాలన్నారు. పత్రికల్లో వచ్చే అభ్యర్థుల ప్రకటనలు, చెల్లింపు ఖర్చును ఎన్నికల నియమావళి మేరకు ఎంసీఎంసీ పరిశీలించి రేట్‌కార్డు ఆధారంగా ఖర్చు లెక్కించి అభ్యర్థుల ఎన్నికల ఖర్చు ఖాతాకు జమ చేసేందుకు సంబంధిత ఆర్వోలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఇతర నేతలను విమర్శించే ప్రకటనలు, కుల, మతపరంగా దాడులను ప్రోత్సహించే ప్రకటనలు, అసభ్యకరమైన పరువు నష్టం కలిగించే విధంగా ప్రకటనలు చేయరాదన్నారు. రానున్న ఎన్నికల్లో పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విజయవంతంగా నిర్వహించేందుకు మనమందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, నగర కమిషనరు ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధరగౌడ్‌లతో పాటు ఎంసీసీ నోడల్ అధికారులు, జిల్లా మాస్టర్ ట్రైనర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాగళం కార్యక్రమం వాయిదా

మైదుకూరు, మార్చి 3: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 6న మైదుకూరులో చేపట్టిన ప్రజాగళం కార్యక్రమం వాయిదా పడినట్లు మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్తుండటంతో ఈ కార్యక్రమం వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల ప్రలోభాలకు తెర

- రైల్వేకోడూరు మండలంలో వైసీపీ చీరల పంపిణీ

రైల్వేకోడూరు, మార్చి 3: ఎన్నికల నోటిఫికేషన్ రాక మునుపు అయితే ఎవరూ అడ్డు చెప్పరని ఓట్లు దండుకునేందుకు ప్రభుత్వం కొత్త పన్నాగం వేసింది. ప్రజలను ఎలాగైనా ప్రలోభాలకు గురి చేయాలని ఆదివారం రైల్వేకోడూరు మండలంలోని తిమ్మిశెట్టిపల్లె పంచాయతీ కేంద్రంలో బహిరంగంగా అధికార వైసీపీ నాయకులు వలంటీర్ల సాయంతో రేషన్ కార్డు ఉన్న ప్రతి ఇంటికి చీర కల్గిన బ్యాగును పంపిణీ చేశారు. బ్యాగుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఫొటోలు ముద్రించి ఉన్నాయి. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేద్దాం అని బ్యాగుపై రాసి ఉంది. ఎన్నికల సమయంలో అయితే పంపిణీ చేయలేమనే ఆలోచనతో ముందుగానే ప్రజల్ని ఆకట్టుకునేందుకు వైసీపీ ఒక పథకం ప్రకారం ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు తెరలేపిందని జనసేన నాయకుడు గంధంశెట్టి దినకర్‌బాబు ఆరోపించారు. ఇలాంటి ప్రలోభాలను ప్రజలే అడ్డుకుని ఇప్పుడే చెక్ పెట్టాలని కోరారు. దీనిపై ఎన్నికల ప్రత్యేక అధికారి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రత్యేక వాహనాల్లో పెద్ద, పెద్ద సంచుల్లో చీర బ్యాగులు తీసుకుని వచ్చారన్నారు.

భూ..బొక్కుడు చట్టం

- పథకాల మోజులో పట్టించుకోని జనాలు
- రెండేళ్లకు ఆదమరిస్తే స్థిరాస్తులు పరులపాలే
- భూసమస్యలపై కోర్టు కెళ్లకుండా సెక్షన్లు
- స్థిరాస్థుల అధికారాలన్నీ రెవెన్యూ గుప్పిట్లోకే
- రాజ్యాంగ విరుద్ధ చట్టం అంటూ గళమెత్తిన న్యాయవాదులు
- చాపకిందనీరులా భూహక్కుచట్టం అమలుకు రంగం సిద్ధం?



కడప (కలెక్టరేట్), మార్చి 3: జగన్ సర్కారు భూసమస్యల పరిష్కారం కోసమంటూ గత ఏడాది అక్టోబరులో తాజాగా తెచ్చిన జీవో నెంబరు 512 భూహక్కు సంరక్షణ చట్టం స్థిరాస్థిదారులకు గుదిబండగా మారనుంది. స్థిరాస్తుదారుల భూములు, స్థలాలకు రక్షణ లేని విధంగా లోపభూయిష్టమైన చట్టం అమలు చేసేందుకు సిద్ధమైంది. రెవెన్యూ రికార్డుల్లో స్వచ్ఛీకరణ ప్రక్రియతో నేటికీ రెవెన్యూ శాఖ సతమతమవుతోంది. ఇంతకాలం కొందరు రెవెన్యూ అధికారులు అవినీతితో చేసిన తప్పులు, చేస్తున్న తప్పుడు రికార్డులతో తారుమారుగా రికార్డుల్లో పేర్లు చేర్చడంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా చితికిపోయారు. కబ్జాదారులకు అండగా ఉండే విధంగా రూపొందించిన ఈ చట్టం భవిష్యత్తులో స్థిరాస్థిదారుల భూహక్కులను కాలరాయడం ఖాయమంటున్నారు. భూవివాదాలు తలెత్తితే న్యాయస్థానాలను ఆశ్రయిస్తారు. కానీ ఈ చట్టంలో న్యాయస్థానాల జోక్యం లేకుండా రెవెన్యూ ట్రిబ్యునల్‌లోనే తేల్చుకోవాలి. అక్కడ న్యాయం జరగకపోతే తీర్పు వెలువడిన 15 రోజుల్లోనే రాష్ట్ర స్థాయి ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలి. అక్కడ కూడా న్యాయం జరగకుంటే హైకోర్టు మెట్లెక్కాల్సిందే. ఇంతటి తతంగాన్ని కూడా రెండేళ్లలోగా భూహక్కుదారుడు నిరూపించుకోవాలి. లేకుంటే మీభూమి హక్కులు చేజారినట్లే. ఈ చట్టంపై పేదలు, ఎస్సీ, ఎస్టీ స్థిరాస్థిదారులకు అవగాహన లేని కారణంగా భూములు కోల్పోయే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. నీతి ఆయోగ్ చెప్పిందంటూ న్యాయ కమిషన్‌ను సంప్రదించకుండా ఏకపక్షంగా తెచ్చిన ఈ చట్టం పేదల భూములను కొల్లగొట్టేందుకేనన్న విమర్శలున్నాయి. జగన్ సర్కారు తెచ్చిన ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, దీనిని తప్పుపడుతూ న్యాయవాదులు భూహక్కుచట్టం రద్దుకు రోడ్డెక్కారంటే ఆలోచించాల్సిన విషయమే. ఉచిత పథకాల మోజులో పడ్డ ప్రజలకు ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై మేల్కొకపోతే మున్ముందు భూసంరక్షణ చట్టం బడాబాబుల బొక్కేచట్టంగా మారనుందని రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు హెచ్చరిస్తుండడం గమనార్హం.

రెవెన్యూతోనే భూసమస్యలు..

జిల్లాలో భూసమస్యలు, వివాదాలకు కారణం రెవెన్యూ యంత్రాంగమే. ప్రజల స్థిరాస్తులకు జవాబుదారిగా ఉండాల్సిన తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో ఉదాశీనంగా వ్యవహరిస్తుండడం వల్ల భూసమస్యలు పుట్టుకొస్తున్నాయి. ముఖ్యంగా ప్రతి సోమవారం కలెక్టరేట్, మండలాల వారీగా జరిగే స్పందన కార్యక్రమాల్లో వందకు 75 శాతం భూములు హద్దులు చూపాలనో, ఆక్రమించారనో, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారనే ఫిర్యాదులు వస్తుంటాయి. మండల స్థాయిలో పారదర్శకంగా విచారణ చేపట్టాల్సిన తహసీల్దార్లు అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పనిచేయాల్సి రావడంతో ఏకపక్ష నిర్ణయాలతో ఇప్పటికే పేదల భూములు వందలాది ఎకరాలు పెద్దలకు కట్టబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. మండలాలకు వచ్చే తహశీల్దార్లను అధికార పార్టీ నేతలే ఎంపిక చేసుకునే వింత సంప్రదాయం ఉంది. ఇప్పుడున్న తహశీల్దారు అధికార పార్టీ పెద్దలు చెప్పినట్లు చేయడానికే అన్నట్లు తరించిపోతుంటారు. ఇంతటి రాజకీయ జోక్యంతో పనిచేసే తహసీల్దార్లకు భూహక్కు చట్టం సంరక్షించడం అసాధ్యమంటున్నారు. ఇప్పటికే జిల్లాలో పాత కాలం నాటి రెవెన్యూ రికార్డులు కొందరి అధికారుల ధనదాహానికి దహనమయ్యాయి. సంబంధం లేని పేర్లు అడంగల్, ఆన్‌లైన్‌లో చేర్చి ఆక్రమణదారులకు హక్కు కల్పించడంతో నిజమైన హక్కుదారులకు కోర్టుతో కుస్తీలు తప్పడం లేదు. ఇటీవల సీకే దిన్నె, వీఎన్ పల్లె, అట్లూరు లాంటి కొన్ని మండలాల్లో అవినీతి అధికారులు సస్పెండ్ కావడం ఇందుకు నిదర్శనం. అంతేకాకుండా జిల్లాలోని అన్ని మండలాల్లో ఇంతకాలం తహశీల్దార్లు వెలగబెట్టిన భూముల చిట్టా జిల్లా కేంద్రంలో ఉంది. నోటీసులు ఇచ్చి కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులు గుట్టుచప్పుడు కాకుండా విచారణ చేస్తున్నారు. అయితే అధికార పార్టీ పెద్దలు తమకు సహకరించిన తహసీల్దార్లను కాపాడేందుకు మోకాలడ్డుతున్నారనే విమర్శలున్నాయి.

స్థిరాస్థి అమ్మకాలపై ఫిర్యాదులొస్తే అంతే

ప్రజల భూములు, ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార భవనాలు వివాదాలు లేనివి, వివాదాలు ఉన్నవి, రాతపూర్వక ఒప్పందాలు ఉన్నవిగా మూడు రిజిస్టర్లలో నమోదు చేస్తారు. అయితే ఖరీదైన ఆస్తి అమ్మకాలు, కొనుగోలులో పెద్దల కన్ను పడితే అంతే సంగతులు. తప్పుడు పత్రాలతో ఫిర్యాదు చేస్తే పరిష్కారం అయ్యేంత వరకు స్థిరాస్తిదారుడు ఆస్థిని విక్రయించడం అసాధ్యం. ఇకపోతే జిల్లాలో ఎక్కడ చూసినా కబ్జాల పర్వం అధికమైంది. నిజమైన హక్కుదారుడు తాజాగా వచ్చిన భూసంరక్షణ చట్టంలోని విషయాలపై అవగాహన లేక సకాలంలో న్యాయంకోసం దరఖాస్తు చేసుకోకపోతే ఆక్రమణ దారులకు ఆస్తి సొంతం అయ్యేవిధంగా ఈ చట్టంలో పలు సెక్షన్ల ద్వారా వెల్లడి అవుతోంది. ఇకపోతే ఉపాధి నిమిత్తం కువైత్, ఖత్తర్, సౌదీఅరేబియా లాంటి దేశాల్లో పని చేసే వ్యక్తుల భూసమస్యలు వస్తే చిక్కులు వచ్చినట్టే. రెవెన్యూ రికార్డుల్లో భూఆక్రమణ దారుడి పేరు ఉండటం వల్ల భూహక్కుదారుడికి సమాచారం చేరే అవకాశాలు తక్కువే. ఆయన తిరిగి ఇండియాకు రావాలంటే రెండు, మూడేళ్ల కాలం పట్టవచ్చు. ఈలోగా ట్రిబ్యునల్‌లో రెండేళ్లలోగా అప్పీలు చేయని కారణంగా హక్కుదారునికి చెందాల్సిన భూమి భూబొక్కుడు చట్టంలోని చుట్టాలకు చేరడం ఖాయం.

భూసంస్కరణలా.. భూబొక్కుడు చట్టమా?

జగన్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి భూసంస్కరణల పేరుతో శాశ్వత భూహక్కు-రక్షణ పథకం పేరుతో రీసర్వే ప్రక్రియ చేపట్టారు. రీసర్వేలో భూమి పాస్‌బుక్‌ల్లో భూయజమాని ఫొటోకు బదులు ముఖ్యమంత్రి ఫొటో ముద్రించుకోవడం సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నిజమైన భూహక్కుదారుడు జగనా? లేక ఇన్నాళ్లు కాయ కష్టం చేసుకొని భూములు సంపాదించుకున్నా రైతా? అనే విషయం రైతుల్లో గందరగోళంగా ఉంది. భూములు, స్థలాల రిజిస్ట్రేషన్ల విధానంలో స్టాంపులకు మంగళం పాడారు. ఈ-స్టాంపు విధానం తెచ్చి రిజిస్ట్రేషన్ల శాఖపై ఉన్న నమ్మకాన్ని పోగొట్టారు. జిరాక్సు డాక్యుమెంట్ల పత్రాలతో ఆస్తులను రక్షణ లేకుండా ప్రజల్లో అభద్రత కల్పించారని అపవాదు మూటగట్టుకున్నారు. ఎన్నికల వేళ ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని భావించి ఈ చట్టాన్ని చుట్టి పక్కన పెట్టారు. ఇదే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే భూసంరక్షణ చట్టం అడ్డు,అదుపు లేకుండా అమలు కావడం ఖాయం

తహశీల్దారు అనుమతి ఉంటేనే..

తాతల కాలం నాటి భూములు, ఇంటిస్థలాలు, ఇతర స్థిరాస్థులను అమ్ముకోవాలంటే ఇక మీదట తహశీల్దారు అనుమతి ఉండాల్సిందే. లేకపోతే ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగదు. ఒకవేళ రిజిస్ట్రేషన్లు జరిగినా చెల్లవు. ఇలాంటి వింత విధానాలతో ప్రజల ఆస్తులను ప్రభుత్వం గుప్పిట్లో పెట్టుకుని ఆటాడించేలా ఈ చట్టం రూపొందించారని న్యాయ నిపుణులు ప్రభుత్వ నియంతృత్వ ధోరణీపై ఉన్నత న్యాయస్థానాల్లో యుద్ధం చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

ప్రజల ఆస్తులకు రక్షణ లేని చట్టం..



భూసంరక్షణ చట్టం కబ్జాదారులకు రక్షణ కల్పించే చట్టం. లోపభూయిష్టమైన ఈ చట్టంవల్ల స్థిరాస్థిదారులకు భూయాజమాన్యహక్కులకు భంగం కల్గిస్తాయి. అంతేకాకుండా స్థిరాస్థిదారులు భూవివరాలను ప్రభుత్వానికి నిర్ణీత గడువులోగా వివరాలు చెప్పాల్సిందే. లేకపోతే రూ.50 వేలు జరిమానా విధించేలా కఠినంగా, రాజ్యాంగ వ్యతిరేకంగా చట్టం రూపొందించారు. ఇది మునుముందు ప్రమాదకరమే. ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన లేదు. మేల్కోనకపోతే ప్రజలు మూల్యం చెల్లించుకుంటారు.

- సంపత్ కుమార్, సీనియర్ న్యాయవాది

కోర్టుకెళ్లేందుకు వీలు లేదు..



భూసంరక్షణ చట్టం వల్ల పేద, ఎస్సీ, ఎస్టీ రైతులకు అన్యాయం జరగనుంది. చట్టంలోని విధానాలను తెలుసుకుని ప్రజలకు అవగాహన కల్పించేలా ఉద్యమించాల్సి వచ్చింది. భూవివాదాలకు చెక్ పెట్టే విధంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జడ్జిల నియామకం చేపట్టాలి. కోర్టుల్లో తప్పుడుపత్రాలతో ఇబ్బంది పెట్టే కబ్జాదారులకు రెవెన్యూలో అమలు కానున్న ఈ చట్టం వరం కానుంది. ఈ చట్టం అమలైతే న్యాయవాదులకు కేసులుండవని విష ప్రచారం సరైంది కాదు. ప్రజలను జాగృత పరచడంలో తమ వంతుగా ఈ చట్టం రద్దుకు పోరాడుతున్నాం.

- రాజగోపాలరెడ్డి, న్యాయవాదుల సంఘ మాజీ ఉపాధ్యక్షుడు

పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం శ్రమిద్దాం

● ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



పోలియో చుక్కలు వేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప (ఎడ్యుకేషన్), మార్చి 3 : పోలియోరహిత సమాజ నిర్మాణం కోసం శ్రమిద్దామని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా తెలిపారు. ఆదివారం కడప నగరం నకాశ్ హెల్త్ సెంటరులో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0-5 సంవత్సరాల్లోపు ఉన్న పిల్లలందరికీ తమకు దగ్గరలోని పోలి యో కేంద్రాలకు వెళ్లి పోలియో చుక్కలు వేయించవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఉమామహేశ్వర్‌రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

రెండు పోలియో చుక్కలతో జీవితమంతా ఆరోగ్యం

చెన్నూరు, మార్చి 3 : పోలియో చుక్కలు రెండే అయినా వాటి విలువ నిండు జీవితమని ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ అన్నారు. పల్స్‌పోలియో సందర్భంగా చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆదివారం ఆయన పోలియో చుక్కలు వేశారు. మండల వ్యాప్తంగా 45 కేంద్రాల్లో 4290 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 4160 మంది పోలియో చుక్కలు వేయించుకున్నారు. వైద్యాధికారి చెన్నారెడ్డి, హాస్పిటల్ కమిటీ సభ్యులు ప్రదీప్ రెడ్డి, వైద్యులు వంశీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు చుక్కలతో పోలియో నిర్మూలన

కమలాపురం రూరల్, మార్చి 3:రెండు చుక్కలు పోలియో నిర్మూలనకు బాటలు వేస్తాయని పెద్దచెప్పలి పీహెచ్‌సీ డాక్టర్ జావలి ప్రసన్న తెలిపారు. ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా పెద్దచెప్పలి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆమె చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో 98శాతం పల్స్ పోలియో

పులివెందుల రూరల్, మార్చి 3: పులివెందుల పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం 98 శాతంగా నమోదైందని మండల వైద్యాధికారిణి లిఖిత తెలియజేశారు. పులివెందుల వ్యాప్తంగా ఆరు రూట్లు, ఒక మొబైల్ టీం, 57 పోలియో కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. అంతేకాకుండా హైరిస్క్ ఏరియాలలో మరో నాలుగు కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీ, పట్టణంలోని బాకరాపురం, నగరిగుట్ట యూపీహెచ్‌సీల పరిధిలో 0-5ఏళ్లలోపు 8733 మందికి వేయాల్సి ఉండగా 8698 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. ఇంకా మిగిలిన పిల్లలకు 4,5 తేదీలలో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయిస్తామన్నారు.

లింగాల మండలంలో 98 శాతం

లింగాల, మార్చి 3: లింగాల మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో 98 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారిణి పి.సుభాషిణి తెలిపారు. మండల వ్యాప్తంగా 32పోలియో కేంద్రాలు మరియు మొబైల్ టీం ద్వారా ఐదు సంవత్సరాలలోపు గల 3804 మంది పిల్లలకు గాను 3744 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు.

వేంపల్లెలో పల్స్‌పోలియో విజయవంతం

వేంపల్లె, మార్చి 3: వేంపల్లెలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండల వ్యాప్తంగా 51 కేంద్రాలను ఏర్పాటుచేసి పిల్లలకు పోలియోచుక్కలు వేశారు. డాక్టర్ స్వాతిసాయి వైద్యసిబ్బంది పర్యవేక్షణలో ఈ పల్స్‌పోలియో కేంద్రాలను ఏర్పాటుచేశారు. కాంగ్రెస్‌పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ గాయత్రి పలువురు ప్రజాప్రతినిదులు ఆయా పోలియోక కేంద్రాలలో పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. 97.5శాతం మంది పిల్లలకు పోలియోచుక్కలు వేయించినట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో పోలియో చుక్కలు వేయించి వందశాతం పూర్తిచేస్తామన్నారు.

జయహో బీసీ సభకు జిల్లా బీసీలంతా తరలిరావాలి



చెన్నూరు పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న విశ్వనాథాచారి

చెన్నూరు, మార్చి 3 : గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ సమీపంలోని నంబూరు వద్ద ఈ నెల 5న మంగళవారం జరిగే జయహో బీసీ సభను విజయవంతం చేసేందుకు జిల్లాలోని టీడీపీ బీసీ నేతలంతా తరలి రావాలని కడప పార్లమెంటరీ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు విశ్వనాథ ఆచారి అన్నారు.ఈ మేరకు ఆదివారం చెన్నూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీల కోసం వారి శ్రేయస్సు కోసం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు గత పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాడని, ఇప్పుడు కూడా టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టం తెస్తానని చెప్పార న్నారు. అందుకే జయహో బీసీ సభకు తరలిరావాలన్నారు. సమావేశంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఆటో బాబు, కార్యద ర్శి క్రిష్టయ్య, విశ్వబ్రాహ్మణ సంఘం కమలాపురం నియోజకవర్గ నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

'అధికారులు వైసీపీ కబ్జాదారుల కొమ్ముకాస్తున్నారు'

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 3: అధికారులు వైసీపీ కబ్జాదారుల కొమ్ముకాస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో గాలి చంద్ర మాట్లాడుతూ పేదవాడికి ఇంటిస్థలం సుదూర ప్రాంతాల్లో కేటాయిస్తున్న అధికారులు, పట్టణ శివార్లలో విలువైన ప్రభుత్వ వంక, వాగు చెరువు రస్తా, అసైన్డ్ దేవదాయ ఇనాం, వక్ఫ్‌బోర్డు భూములను అధికారపార్టీ నేతలు ఆక్రమించుకుంటుంటే పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. నగరంలోని ఉర్దూ గురుకుల పాఠశాల వద్ద, పుట్లంపల్లె, సాయిబాబా గుడి పక్కన, అమర్ హాస్పిటల్ సమీపం, ఫాతిమా కళాశాల వద్ద, రామరాజుపల్లె వద్ద, యూనివర్సిటీ వద్ద, విమానాశ్రయం వద్ద వంకలు పూర్తిగా ఆక్రమించుకుంటుంటే అధికారులు ఏం చేస్తున్నారని వారు ప్రశ్నించారు. మార్చి 6న ఉమ్మడి కడప జిల్లా జనరల్ బాడీ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామక్రిష్ణ హాజరవుతారన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు సుబ్రమణ్యం, కేసీబాదుల్లా, వలరాజు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణాన్ని అడ్డుకున్న ప్రజలు



ప్రజలకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నేత వికాస్ హరికృష్ణ

సీకేదిన్నె, మార్చి 3: ఊటుకూరు చెరువు సమీపంలో భగత్‌సింగ్ నగర్ వద్ద హిందూ శ్మశాన వాటిక సమీపంలో షాదీఖానా నిర్మాణం చేపట్టడం పట్ల ప్రజలు అభ్యంతరం తెలిపారు. ఆదివారం షాదీఖానా నిర్మాణానికి పనులు చేపట్టేందుకు అక్కడకు వస్తున్నారని తెలుసుకున్న ప్రజలు, అన్ని రాజకీయ పార్టీ నాయకులు అక్కడికి వచ్చి అభ్యంతరం వ్యక్తం చేశారు. షాదీఖానా నిర్మాణాన్ని మరోచోటికి మార్చితే బాగుంటుందని, ఇందు కు టీడీపీ నాయకుడు వికాస్ హరికృష్ణ తదితరులు మద్ద తు తెలుపడంతో షాదీఖానా నిర్మాణం ఆపేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు నిర్వహించారు. దీంతో ప్రజలు ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఉచిత సాఫ్ట్‌వేర్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కడప (మారుతీనగర్), మార్చి 3: నిరుద్యోగ విద్యార్థులు ఉచిత ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ కడప అసెంబ్లీ అభ్యర్థి ఆర్. మాధవీరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక ఓసి సంఘం కార్యాలయంలో ఆ సంఘం వ్యవస్థాపకుడు కందుకూరు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా లైనక్స్, అజుర్, ఎస్.క్యూఎల్ తదితర కోర్సులను ప్రారంభించారు. ట్రైనర్స్ తేజరెడ్డి, రఘునాథరెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షులు ఏమిరెడ్డి యమునారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఇమ్మానుయేల్, మునెయ్య

కడప (ఎడ్యుకేషన్), మార్చి 3 : దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఇమ్మానుయేల్, కనకాల మునెయ్య ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కడప నగరం డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. నూతనంగా ఎంపికైన వారు మాట్లాడుతూ జిల్లా కమిటీ సభ్యులు తమను ఏకగ్రీవంగా ఎంపిక చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

అభివృద్ధికి మారుపేరు టీడీపీ: పుత్తా



సీకేదిన్నె: కార్యక్రమంలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి





కడప: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి..బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న రాంప్రసాద్‌రెడ్డి

సీకేదిన్నె, మార్చి 3: అభివృద్ధికి మారుపేరు టీడీపీ అని కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం చింతకొమ్మదిన్నె మండలం రామచంద్రయ్య కాలనీకి చెందిన 80 కుటుంబాలవారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కార్పొరేషన్‌లో విలీనమైన తెలుగుగంగ కార్యాలయం నుంచి రామచంద్రయ్య కాలనీ వరకు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించి ఇంటింటికి తిరిగి టీడీపీ జనసేన నాయకులతో కలిసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలోనే గతంలో రామచంద్రాయకాలనీ ఏర్పడిందని, కాలనీ అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి కృషి చేశారన్నారు.తెలుగుదేశం, జనసేన ఆధ్వర్యంలో సూపర్-6 పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అన్ని విధాలా అందించేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని రాబోయే ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రామచంద్రయ్య, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, యువనాయకుడు పుత్తా చైతన్యరెడ్డి, తదితరులు పాల్గొని ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే సంక్షేమ పథకాలకు అంకురార్పణ

- శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 3 : టీడీపీ హయాంలోనే సంక్షేమ పథకాలకు అంకురార్పణ జరిగిందని టీడీపీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డిలు తెలిపారు. ఆదివారం కడప నగరం 39వ డివిజన్ 28వ డివిజన్‌లో మోచంపేటలో భారీగా యువత, మహిళలు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడపలో జరుగుతున్న అరాచకాలకు స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీని ఒక్కసారి ఆదరించాలని కోరారు. అనేక సంక్షేమ పథకాలను ఇచ్చేది టీడీపీ పార్టీ మాత్రమేనన్నారు. అలాగే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కడప నగరాన్ని క్లీన్‌గా తీర్చిదిద్దాలంటే తమకు ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జిలానీబాషా, హైదర్, అఫ్సర్, ఖాజాపీర్, ఆరిఫ్‌తో పాటు అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయండి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 3 : రాష్ట్రంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని మాజీ సర్పంచ్ రాంప్రసాద్‌రెడ్డి, ఆయన భార్య సుమిత్ర తెలిపారు. ఆదివారం కడప నగరం 40వ డివిజన్ మరాఠీవీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకుగ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలను అందించారు. అలాగే సైకిలు గుర్తుకుఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలోటీడీపీ నాయకులు రాజశేఖర్. జావీద్, లక్ష్మిదేవి, ఈశ్వరయ్య, శ్రీకాంత్, సత్తార్ పాల్గొన్నారు.

టీడీపీలోకి రండి

● బీజేపీ నేతలకు శ్రీనివాసరెడ్డి ఆహ్వానం

(కడప - ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం టీడీపీలోకి రావాలంటూ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి బీజేపీ నేతలను ఆహ్వానించారు. బీజేపీలో బండి ప్రభాకర్ కీలకంగా ఉంటున్నారు. ఆదివారం బండి ప్రభాకర్ కడపలో 3వ డివిజన్, 42, 43, 4, 6, ఇతర డివిజన్లకు చెందిన బీజేపీ నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి టీడీపీలోకి రావాలసిందిగా కోరారు. సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రెండు మూడురోజుల్లోనే బీజేపీ నేతలంతా టీడీపీ గూటికి రానున్నట్లు తెలుస్తుంది.

గణితం జిల్లా స్థాయి పోటీలు



విద్యార్థి జయ్‌చందన్ క్రిష్ణకు బహుమతి అందజేస్తున్న వైస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 3 : కడప నగరం సాయిబాబా ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఆదివారం విశ్వం ఎడ్యుటెక్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆబాకస్ వేదిక్ మ్యాథ్స్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. 18 సంవత్సరాలు పూర్తి అనుభవంతో ఈ సంస్థ పోటీలు నిర్వహించిందని సాయిబాబా విద్యాసంస్థల వైస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విశ్వం సంస్థ మేనేజర్లు శివ, నాగార్జున, చిన్న తదితరులు పాల్గొన్నారు.

అక్కాయపల్లెలో పార్కు నిర్మాణం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 3 : కడప నగరం అక్కాయపల్లెలో రూ.2.20 కోట్ల నిధులతో అక్కాయపల్లె పార్కు, అక్కాయపల్లె ప్లాజా, శాస్త్రినగర్ పార్కులను ని ర్మించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా తెలిపారు. ఆదివారం స్థానిక కార్పొరేటరు పాకాసురేష్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రితో పాటు మేయర్ సురేష్‌బాబు, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి శిలాఫలకాలను ఆవిష్కరించారు. డిప్యూటీ మేయరు నిత్యానందరెడ్డి, సోషల్ వెల్ఫేర్‌బోర్డు ఛైర్మన్ పులి సునీల్‌కుమార్, స్థానిక కార్పోరేటరు పాల్గొన్నారు.

బీజేపీకి అవకాశం కల్పించండి: వంగళ

కడప (మారుతీనగర్), మార్చి 3: రానున్న ఎన్నికల్లో బీజేపీకి అవకాశం కల్పించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆ మేరకు పార్టీ రాష్ట్ర శాఖ రూపొందించిన పోస్టర్లను ఆదివారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మన దేశాన్ని ప్రపంచంలో అభివృద్ధి చెందిన అగ్రదేశాల సరసన సగర్వంగా నిలిపేందుకు గత పది సంవత్సరాలుగా దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేస్తున్న కృషి అనితర సాధ్యమన్నారు. మన రాష్ట్రంలో సాగుతున్న జగనాసుర పాలనలో ప్రజలు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్న నేపథ్యంలో వైసీపీ పాలనకు ప్రజలు మంగళం పలికి బీజేపీ సర్కార్‌కు స్వాగతం పలికాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బత్తల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్‌తో పాటుగా బీజేపీ నాయకులు గాలి హరిప్రసాద్ పాల్గొన్నారు.

'ఎన్నికల్లో పోటీకి దస్తగిరికి డబ్బు ఎలా వస్తుంది?'

పులివెందుల టౌన్, మార్చి 3: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి ఎన్నికల్లో పోటీ చేసేంత డబ్బు ఎలా వస్తుందని భరత్‌యాదవ్ ప్రశ్నించారు. ఆదివారం పులివెందులలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎంపై మాట్లాడే ధైర్యం దస్తగిరికి ఎలా వస్తుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తానంటే డబ్బు ఎలా వస్తుందన్నారు. దస్తగిరి వెనుక సునీత, ఆమె భర్త రాజశేఖర్ ఉండి మాట్లాడిస్తున్నారన్నారు.వైఎస్ వివేకాను హత్య చేసింది దస్తగిరి, సునీల్ యాదవ్, గంగిరెడ్డి అని, వైఎస్ వివేకా హత్య తర్వాత దస్తగిరి, సునీల్, ఎర్రగంగిరెడ్డి మాట్లాడుతున్నప్పుడు నేను విన్నానన్నారు. నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి నుంచి డబ్బు రావాలి అని ఎర్రగంగిరెడ్డి చెప్పేవారన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో ఆర్‌ఎస్‌పీ పోటీ

కడప (ఎడ్యుకేషన్), మార్చి 3 : వచ్చే ఎన్నికల్లో ఆర్‌ఎస్‌పీ పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనరు సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం తమ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కన్వీనరు కళ్యాణ్ ఓబులేసు, కమిటీ సభ్యులు రవికాంత్, నరేంద్ర, భాస్కర్, దారా గోపి, నర్సింహారావు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడండి

● వేంపల్లెలో బీటెక్ రవి ప్రచారం



వేంపల్లెలో టీడీపీకి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేస్తున్న బీటెక్ రవి

వేంపల్లె, మార్చి 3: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు టీడీపీకి అండగా నిలవాలని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి ప్రజలకు విజ్ఞప్తిచేశారు.ఆదివారం రాజారెడ్డినగర్, శ్రీరామ్‌నగర్,పిల్లస్వామిగుట్ట, గండిరోడ్డు తదితర ప్రాంతాలలో బీటెక్ రవి, ఆయన సతీమణి లతారెడ్డి బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ జనసేన మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని బీటెక్ రవి దీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పెట్టిన వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు వెంకటరమణ, మల్లికార్జున, టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ బాలస్వామిరెడ్డి, మునిరెడ్డి, మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, జయచంద్రారెడ్డి, దర్బార్ బాష, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

కడప (మారుతీనగర్), మార్చి 3: సంచార జాతులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రవి డిమాండ్ చేశారు. సంచార జాతులను జాగృతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా సంచార జాతుల సంఘం జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడు కత్తి రవీంద్ర ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సంచార జాతుల చైతన్య యాత్ర సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంచార జాతుల వర్గీయుల విద్యార్థుల అభివృద్ధికి ప్రతి జిల్లాలో ప్రత్యేక రెసిడెన్సియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగుతున్న నవోదయ, సైనిక్ స్కూల్ కేంద్రీయ విద్యాలయ తదితర పాఠశాలల్లో సైతం ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్‌లను తమ విద్యార్థులకు అవకాశం కల్పించాలన్నారు.

జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడిగా కత్తి రవీంద్ర

సంచార జాతుల సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా కత్తి రవీంద్ర నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 సంచార జాతుల కులాల అభివృద్ధి, సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం సాగిస్తానన్నారు. ముఖ్యంగా రానున్న ఎన్నికల్లో తమ వర్గీయుల అభివృద్ధిని కాంక్షిస్తూ తెలుగుదేశం పార్టీని గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుం డా శ్రమిస్తానన్నారు. టీడీపీ అధినేత చంద్రన్న ముఖ్యమంత్రి కాగానే తమ సంచార జాతుల కళలను సాకారం చేసేందుకు ముందుంటానన్నారు.

జిల్లా నూతన కమిటీ

ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజు, సహాయ కార్యదర్శిగా పి.తంగపోడ దేవర్, ఉపాధ్యక్షుడిగా కె.వెంకటేశు, కె.కృష్ణ, కార్యదర్శిగా శ్రీనివాసులు, ఎస్. నాగయ్య, కె. బాబు, ప్రచార కార్యదర్శిగా కె.వెంకటరమణ, అధికార ప్రతినిధిగా రామానాయుడు, గౌరవాధ్యక్షుడిగా వీరయ్య, సలహాదారుడిగా కత్తి బ్రహ్మయ్య, సభ్యులుగా రవీంద్రన్, పరమశైకళ్లర్, కె.నరసింహులు, నాగేశ్వరరావు, కె.వెంకటసుబ్బయ్య, షేశగిరి, ఎన్ ఆదిలక్ష్మి, ఆర్ నాగరాజు, తదితరులున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై. శ్రీనివాసులు, అదిక సంఖ్యలోసంచార వర్గీయులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, మార్చి 3: పులివెందుల పట్టణంలోని పలు ప్రాంతాలలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పులివెందుల అర్బన్ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి కడప రోడ్డు, పార్నపల్లె రోడ్డు, ఉలిమెల్ల రోడ్డు ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో ట్రీ కటింగ్ ఉన్నందున సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ ఉండదన్నారు. అలాగే 11కెవి ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసీ) ఫీడర్‌లో మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల టౌన్, మార్చి 3: మండలంలోని నలపురెడ్డిపల్లె, ఇ.కొత్తపల్లె, సరస్వతీ మైన్స్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో సోమవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలో మరమ్మత్తులు చేస్తున్నందున ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

లింగాలలో...

మండలంలోని పలు గ్రామాలలో సోమవారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ లింగాల ఏఈ రమేష్‌బాబు, వెలిదండ్ల ఏఈ బాలసంజీవులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మురారిచింతల ఫీడర్‌లో సాంకేతిక కారణాల వల్ల మరమ్మతులు చేయాల్సి ఉన్నందున అంబకపల్లె, హిరోజిపురం, మురారిచింతల సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో ఈ అంతరాయం ఉంటుందని తెలిపారు.

'వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలి'

కడప(రూరల్) మార్చి 3 : వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలని ఏపీ నాన్‌గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల చైర్మన్లు నంద్యాల రాజశేఖర్, జయప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని బహుళార్థ పశువైద్యశాలలో వెటర్నరీ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాదయాత్ర సమయంలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్‌కు గెజిటెడ్ హోదా ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్స్ పోస్టులు రాష్ట్ర వ్యాప్తంగా 300 ఉన్నాయని వీటిని వెంటనే భర్తీ చేయాలన్నారు.

బీసీ డిక్లరేషన్ సదస్సును విజయవంతం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న రాంప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 3: విజయవాడ మంగళగిరి నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ప్రాంగంలో ఈ నెల 5న జరిగే బీసీ డిక్లరేషన్ సదస్సును విజయవంతం చేయాలని టీడీపీ బెస్తసాధికార కమిటీ రాష్ట్ర కన్వీనరు యాటగిరి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ద్వారకనగర్ టీడీపీ కడప అభ్యర్థి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 5న బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్ర, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెమనాయుడు ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్ సదస్సు జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జాతీయ ప్ర ధాన కార్యదర్శి నారా లోకేశ్ హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన బీసీ ప్రతినిధులందరూ పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బీసీలకు అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలప్రణాళికలు ప్రకటించనున్నారని అధికార కమిటీల ద్వారా ఆయా కులాల సమస్యలను వారి డిమాండ్లు కూడా పరిశీలించి మేనిఫెస్టోలో పెట్టే విధంగా నిర్ణయాలు తీసుకుంటారన్నారు.

అధికార పార్టీ నాయకుల బరితెగింపు


ఎక్స్‌కవేటర్‌తో గుట్టను తొలగిస్తున్న దృశ్యం

- గుట్టలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ
- రెవెన్యూ సిబ్బందిపై అధికార పార్టీ నాయకుల ఆగ్రహం

ప్రభుత్వ భూములపై అధికార పార్టీ నాయకుల కన్ను పడితే చాలు గుట్టలు, ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు ఏమీ వదలడం లేదు. ఒకప్పుడు సెలవు దినాల్లో గుట్టుచప్పుడు కాకుండా చేసేవారు. ఇప్పుడు పట్టపగలే ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారు. జిల్లాలో వైసీపీ నాయకులు రోజురోజుకు బరి తెగిస్తున్నారు. పట్టపగలే యంత్రాలతో గుట్టలు, ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారు. పనులు ఆపేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులు, వీఆర్‌వో, వీఆర్‌ఏపై వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తాము ఆర్డీవోతో మాట్లాడామని, పనులు నిలిపేది లేదని యథేచ్ఛగా యంత్రాలతో పనులు చేపడుతున్నారు.

సంబేపల్లె, మార్చి 3: సంబేపల్లె మండలంలోని ఎస్.సోమవరం గ్రామ సర్వే నెంబర్ 86 ఊడగానిగుట్ట ఇందులో ప్రభుత్వ భూమి 135 ఎకరాలు కలదు. సర్వే నెంబర్ 113, ప్రభుత్వ పొరంపోకు భూమి, సర్వే నెంబరు 114 ల్యాండ్ సీలింగ్ భూములు ఆనుకుని ఎర్రమొరంబండను స్థానిక వైసీపీ నాయకులు యంత్రాలతో వారం రోజులుగా చదును చేస్తున్నారు. రెండు రోజుల క్రితం రెవెన్యూ సిబ్బంది దృష్టికి ఈ విషయం రావడంతో వారు అక్కడికి వెళ్లి పనులు నిలబెట్టారు. తిరగి ఆదివారం ప్రభుత్వ కార్యాలయానికి సెలవు కావడంతో ఉదయం నుంచి యంత్రాలతో పనులు చేపట్టారు. ఈ విషయం తహసీల్దార్‌కు తెలియడంతో వీఆర్‌వో, వీఆర్‌ఏతో పాటు పోలీసు సిబ్బందిని పనులు నిలబెట్టాలంటూ పంపించారు. అయితే స్థానిక వైసీపీ నాయకులు వారిని లెక్క చేయలేదు. ఆర్డీవోతో తాము మాట్లాడామని పనులు నిలబెట్టకుండా యథేచ్ఛగా పనులు చేయడం విశేషం. ఇంత బరి తెగిస్తున్నారంటే వీరి వెనుక బలమైన నాయకుల అండదండలు ఉన్నాయని తెలుస్తోంది. జిల్లాస్థాయి అధికారులను తమ కనుసన్నల్లో ఉంచుకుని పనులు చేస్తున్నారని, స్థానికంగా పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడేది ఎవరు

జిల్లాలో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను అప్పనంగా కాజేసేందుకు అధికార పార్టీ నాయకులు ఎంతకైనా బరి తెగిస్తున్నారు. వాగు, వంక, పొరంబోకులు ఇలా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకడంతో ఇక ప్రభుత్వ భూములు కాపాడేది ఎవరని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఎస్.సోమవరంలో ప్రభుత్వ భూమి, గుట్టలు ఆక్రమణపై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా వీఆర్‌ఏ, పోలీసు సిబ్బందిని పనులు నిలబెట్టేందుకు పంపామని పరిశీలించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.


వీఆర్‌వో చెప్పినా వినకుండా చేస్తున్న పనులు

బంగారం పేరుతో మోసగించిన ముగ్గురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చైతన్య

రాజంపేటటౌన్, మార్చి 3: తక్కువ ధరకు బంగారం ఇస్తామని నమ్మబలికి ఓ వ్యక్తి నుంచి రూ.18 లక్షలు కాజేసిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు రాజంపేట డీఎస్పీ వి.ఎస్.కె. చైతన్య తెలిపారు. ఆదివారం రాజంపేట పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని చెప్పి రూ.18 లక్షలు తీసుకుని ముగ్గురు వ్యక్తులు తనను మోసగించారంటూ ఓబులవారిపల్లె మండలం యల్లాయపల్లెకు చెందిన చేకూరి రమణయ్య గతంలో ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ చిన్న రెడ్డయ్య కేసు నమోదు చేశాడన్నారు. కేసు దర్యాప్తులో నిందితులు మదనపల్లెకు చెందిన పర్వతాల సురేంద్ర, మాచంరెడ్డప్ప, ముంతల వెంకటేష్‌గా తేలడంతో, ఫోన్‌కాల్స్, ఆధునిక పరికరాల సాయంతో వారి ఆచూకి గుర్తించి అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.14.50 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు గతంలో కూడా కాళహస్తి, పీలేరు తదితర ప్రాంతాల్లో ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు డీఎస్పీ తెలియజేశారు. నిందితులను కోడూరు కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు రూరల్ సీఐ పి.సురేంద్ర నాథ్‌రెడ్డి, ఓబులవారిపల్లె పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లర దుకాణం దగ్ధం


చిల్లర దుకాణం కాలిపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధ దంపతులు

ఓబులవారిపల్లె, మార్చి 3: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో చిల్లర దుకాణం అగ్నికి ఆహుతైందని గోబూరివారిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన గుత్తి సుబ్బరాయుడు ఆరోపించారు. పెద్దఓరంపాడు సిద్దులమ్మ, గుత్తి సుబ్బరాయుడు గ్రామంలో చిల్లర దుకాణం నిర్వహిస్తుంటారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో నిద్ర లేచి చూడగా దుకాణం మంటల్లో కాలిపోవడం కనిపించింది. ముందు రోజే అంగడి సరుకులన్నీ తీసుకొచ్చామని, ఆధార్, ఆరోగ్యశ్రీ, గ్యాస్‌బుక్, పోస్టాఫీసు బుక్, రేషన్‌కార్డు, బంగారు కమ్మలు వంటివన్నీ కాలిపోయాయని, సుమారు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ యువ నాయకుడు జై భరత్‌రెడ్డి వృద్ధ దంపతులను పరామర్శించారు. వీఆర్వో మనోహర్ ఘటనపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అక్కమ్మ గారి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువతి మృతి


ప్రమాదంలో మృతి చెందిన శ్రీవిద్య

నందలూరు, మార్చి 3: ట్రాక్టర్ ఢీకొని ఓ యువతి మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు పాటూరు నబి కోటకు చెందిన చంద్రమోహన్ తన కూతురు శ్రీవిద్య (17)తో కలిసి ద్విచక్ర వాహనంలో నాగిరెడ్డిపల్లె వైపు వెళుతూ మూత్ర విసర్జన నిమిత్తం ప్రవీణ్ బ్రిక్స్ వద్ద వాహనాన్ని ఆపి పక్కకు వెళ్లాడు. అదే సమయంలో రోడ్డుపై నిలుచున్న శ్రీ విద్యను ట్రాక్టర్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చంద్రమోహన్, శివరాణి దంపతులకు ముగ్గురు కుమార్తెలుండగా, శ్రీ విద్య చిన్నకుమార్తె. నందలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ట్రాక్టర్ డ్రైవర్ చవ్వాకుల వెంకటరమణ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు.

177 మద్యం బాటిళ్లు స్వాధీనం


పోరుమామిళ్లలో ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పోరుమామిళ్ల, మార్చి 3: ఆర్మీ మాజీ జవాన్లకు క్యాంటీన్ ద్వారా లభించే మద్యాన్ని పోరుమామిళ్లలోని శ్రీరామ్‌వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి నిల్వ ఉంచుకోవడంతో ఆ సమాచారం తెలుసుకున్న ఎస్‌ఈబీ ఎస్‌ఐ వరలక్ష్మి, ఎక్సైజ్ సీఐ మంజుల ఆకస్మిక దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి 177 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఆదివారం పోరుమామిళ్లలో మద్యం డంప్ ఉన్న విషయం తెలుసుకున్నఎక్సైజ్ అధికారులు రంపాడు రోడ్డులో శ్రీరామ్ వెంకటసుబ్బయ్య ఇంట్లో తనిఖీలు చేయగా డంప్‌గా ఉంచిన 177 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


చనిపోయిన గుర్తు తెలియని వ్యక్తి

ఖాజీపేట, మార్చి 3: కడప, కర్నూలు జాతీయ రహదారిలోని బుడ్డాయపల్లె సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. బుడ్డాయపల్లె సమీపంలో ఆదివారం ఉదయం భిక్షాటన చేసి రోడ్డు పక్కన పడిపోవడంతో ఆదారిన వెళ్లే ప్రజలు గమనించి స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే సీఐ రామాంజులు స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కడప రిమ్స్‌కు తరలించారు. ఇతని ఒంటిపై గీతల చొక్కా, జీన్స్‌ప్యాంట్ ఉందని, ఎవరైనా సమాచారం తెలిస్తే 9121100623కు సమాచారం ఇవ్వాలని సీఐ అన్నారు.

‘విశ్వవిద్యాలయాలు పరిశోధన కేంద్రాలు కావాలి’

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 3: విశ్వవిద్యాలయాలు పరిశోధన ఆవిష్కరణ కేంద్రాలు కావాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసరు హేమచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఏపీ విద్యా ప్రణాళిక బోర్డు ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, డైరెక్టర్లకు గుంటూరులో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ ప్రతినిధులుగా హాజరయ్యారు.

కాంగ్రెస్ నేత గోల్డ్ అల్లాబకాష్ టీడీపీలో చేరిక


రాయచోటి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అభ్యర్థి గోల్డ్ అల్లాబకాష్ టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సుగవాసి సుబ్రమణ్యం

- కండువా కప్పి ఆహ్వానించిన సుగవాసి సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, మార్చి 3: సీనియర్ కాంగ్రెస్ నేత గోల్డ్ అల్లాబకాష్, మరికొందరు మైనారిటీ నాయకులు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో హోటల్ ఫరూక్ ఇంట్లో నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశంలో టీడీపీ సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు కండువా కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. మైనార్టీ నేతలు వారికి శాలువా కప్పి పూలదండతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఖాదర్ బాషా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు రాయచోటిని అభివృద్ధి చేశారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో రాయచోటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యంను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్, సైఫుల్లా, ఇర్షాద్ అబూబకర్, హబీబుబర్, హోటల్ ఫారూఖ్, సయ్యద్, గోపాల్, బీడీ రెడ్డి, కూరగాయల ఖాజా, ఫైజాన్, ఫిరోజ్, సౌకత్, మొయినుద్దీన్, ఆరీఫ్, సుల్తాన్, చిక్కా ఫయాజ్, కొంత మంది ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

వైసీపీని గెలిపిస్తే దళితుల బతుకులు మృగ్యం

- మాదిగ మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

కడప(మారుతీనగర్), మార్చి 3: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో మరోసారి వైసీపీ వస్తే దళిత, గిరిజనుల బతుకులు మృగ్యం అవుతాయని మాదిగ మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బి.ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్త జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం కడప ప్రెస్‌క్లబ్‌లో మాదిగ మహానాడు జిల్లా అధ్యక్షుడు గున్నా జయరాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాల పదినెలల వైసీపీ పాలనలో దళితులపై దాడులు, హత్యలు, బెదిరింపులు, మహిళలపై అత్యాచారాలు పెచ్చుమీరాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో మాస్కులు లేవన్న పాపానికి దళితుడైన డాక్టర్ సుధాకర్‌ను పట్టపగలే నడిరోడ్డుపై చిత్రహింసలకు గురిచేసి ఆయన మృతికి వైసీపీ ప్రభుత్వం కారణమైందన్నారు. ముఖ్యంగా దళితుల అభివృద్ధి, సంక్షేమం నిమిత్తం కేంద్రం ద్వారా రాష్ట్రానికి వచ్చే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కూడా దళితులకు ఇవ్వకుండా దారి మళ్లించి, దళిత, గిరిజనుల నోట్లో జగన్‌రెడ్డి మట్టికొట్టారని ధ్వజమెత్తారు. దీంతో పాటు గత కొన్ని సంవత్సరాలుగా దళితులకు చేయూతనిచ్చే ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లలో నిధులను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా గతంలో ఎస్సీ కార్పొరేషన్, లిడ్‌క్యాప్ ద్వారా దళితులకు సబ్సిడీ రుణాలు అందేవని, వాటి ద్వారా అంతో ఇంతో ఏదేని వ్యాపారాలు, చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించే వారన్నారు. ఇప్పటికైనా దళితులు మరోసారి మోసపోకుండా వైసీపీని గద్దె దించేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాదిగ మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి ఎ.ప్రకాష్, కమిటీ ఆర్గనైజర్ బి.బాజి, ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షుడు వై.విజయ్, నగర కమిటీ నాయకులు రమణయ్య, గోపయ్యతో పాటుగా సురభి రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దీనదయాల్ కుటుంబ సభ్యులు

సీకేదిన్నె, మార్చి 3: చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లె అభయ ఆంజనేయస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి గాను గ్రామానికి చెందిన వెంకటేశ్వర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వినుకోలు దీనదయాల్ కుమారుడు సుభాష్ సతీమణి అరుణకుమారి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం అందజేశారు. అడిగిన వెంటనే ఆలయ నిర్మాణం కోసం సానుకూలంగా స్పందించి చందా అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్వామివారి ఆశీస్సులు వారి కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని కోరుతున్నారు.

ఆలయానికి రూ.50 వేలు వితరణ


నగదు వితరణ చేస్తున్న కాంతమ్మ

కడప(కల్చరల్), మార్చి 3: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలో వెలసిన పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ అభివృద్ధికి కాంతమ్మ అనే భక్తురాలు ఆదివారం రూ.50 వేలు విరాళంగా అందించారు. ప్రతిరోజు కూలి పనిచేసే ఆమె రోజువారిగా రూ.200 జమచేసి మొత్తంగా రూ.50 వేలు ఇవ్వడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, మార్చి 3: మండలంలోని చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారు సంతానలక్ష్మిగా ప్రసిద్ధి చెందారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధికంగా రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి.

జీవితంలో ప్రతి సమస్యకూ పరిష్కారం


స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కడప(ఎడ్యుకేషన్), మార్చి 3: జీవితంలో సమస్యలు చుట్టుముట్టినప్పుడు వాటిని పరిష్కరించే ఆలోచన చేస్తే తప్పక మార్గం కనిపిస్తుందని వైవీయూ సైకాలజీ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ లలిత పేర్కొన్నారు. ఆదివారం పెండ్లిమర్రి మండలం వేలూరుపాడు గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించి ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ వెళ్లి రైతులు, వృద్ధులు, మహిళలు, యువకులను కలిసి ఆత్మహత్యల నివారణపై చైతన్యం కల్పించారు. జీవితం విలువ ప్రాముఖ్యతను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, బయోటెక్నాలజీ, సైకాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు, మార్చి 3: మండల పరిధిలోని సి.కొత్తపల్లె గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ వెంకటరమణ తన సిబ్బందితో దాడి చేసి అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు సి.కొత్తపల్లె గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న వ్యక్తిపై దాడిచేసి అతని వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేకంగా మద్యం అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఏఎస్‌ఐ మోహన్‌తో పాటు కానిస్టేబుళ్లు ఉన్నారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్టు - నగదు స్వాధీనం

ఓబులవారిపల్లె, మార్చి 3: మండలంలోని బొమ్మవరం పరిసర ప్రాంతాల్లో కోడిపందేలు ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. గ్రామ పరిసరాలలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకొని, 5700 నగదు, నాలుగు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి

బ్రహ్మంగారిమఠం, మార్చి 3 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని స్థానిక యాదవ సమాజ అన్నదాన సత్రంలో ఆదివారం కమిటీ సభ్యులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 8న మహాశివరాత్రి పండుగ సందర్భంగా యాదవ సమాజ అన్నదాన సత్రానికి వచ్చే భక్తులకు తాగునీరు, భోజన వసతి సౌకర్యాన్ని అందించేందుకు కమిటీ సభ్యులందరూ విచ్చేసి ఏర్పాట్లను అందరూ కలిసికట్టుగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లక్కినేని బాలరాజుయాదవ్, కోశాధికారి మేకల పెద్దన్నయాదవ్, శ్రీనివాసులు, సర్పంచ్ చిలమల నారాయణ, సుధాకర్, చిలమల నాగయ్యతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 70 కుటుంబాలు టీడీపీలో చేరిక



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 70 కుటుంబాలు

బద్వేలు టౌన్, మార్చి 3 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రానికి భస్మాసురుడులా మారాడని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త రితీస్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లెలో రితీష్‌కుమార్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గంగిరెడ్డి, నరసింహారెడ్డి, జయసుబ్బారెడ్డి రామిరెడ్డిల ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 70 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, ప్రసాద్, సింగసాని విజయ్, రవికుమార్‌రెడ్డి, జడ్పీటీసీ జయరామిరెడ్డి, మిత్తికాయల రమణ, సింగరయ్య, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, నాగరాజు, అంకయ్య, హనుమంతు, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ప్రజాపోరు

చాపాడు, మార్చి 3: మండలంలోని సోమాపురం, సిద్దారెడ్డిపల్లె, నాగాయపల్లె, మొరాయిపల్లె గ్రామాల్లో ఆదివారం మండల బీజేపీ అధ్యక్షుడు బొగ్గుల చంద్రశేఖర్‌రెడ్డి ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్నపథకాలతో దేశంలో పేదరికం తగ్గుతోందని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్షుమయ్య, సుబ్బరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదు



రాజుపాలెం, ఎర్రగుంట్ల, కాశినాయన మండలాల్లో ప్రచారం నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, భూపేశ్‌రెడ్డి, బొజ్జ రోశన్న

రాజుపాలెం, మార్చి 3: మండల పరిధిలోని గాదెగూడూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గడప గడపకూ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వెళ్లి టీడీపీకి సైకిలు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రతి కుటుంబానికి ఆరు గ్యారంటీల కరపత్రాన్ని అందించారు. గ్రామంలో యువకులు, నాయకులు భారీ సంఖ్యలోపాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రోశిరెడ్డి, మండల కన్వీనరు విశ్వనాథరెడ్డి, రాష్ట్ర బీసీ నాయకులు తాటి శ్రీనివాసులు, ఎంపీటీసీ గుత్తి దస్తగిరి, సర్పంచ్ కొరపాడు శ్రీనివాసులరెడ్డి సానా వెంకటసుబ్బారెడ్డి, సౌరెడ్డి, పద్మనాభరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మైలవరం..: తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని, మే తర్వాత టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కానుందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి తల్లి దేవగుడి సరస్వతి, సతీమణి జ్యోతి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వద్దిరాల గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రలీగల్ కార్యదర్శి సూర్యపెద్దిరాజు, బీసీ సెల్ కార్యదర్శి కొండయ్య, మైలవరం క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, పాపిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు చంద్రశేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసింహులు, టీడీపీ నాయకులు నీలకంఠారెడ్డి, బాలరాజు, గురువయ్య, హరియాదవ్, గంగాదర్, గోపాల్, ఓబులేసు, అంకాలు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: టీడీపీ అధికారంలోకి రాగానే ఎర్రగుంట్లనగరపంచాయతీలో ప్రజలపై ఉన్న పన్నుల భారాన్ని తగ్గిస్తామని టీడీపీ జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదివారం ఎర్రగుంట్లనగరపంచాయతిలోని 8,9,10వార్డుల్లో ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి సి.జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, టీడీపీ నాయకులు టైలర్ మాబు, విజయేంద్ర, శ్రీనివాసులు, అబ్దుల్, జనసేన నాయకుడు జగదీష్, మాజీ జడ్పీటీసీ వి.వెంకటశివారెడ్డి, టౌన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: రాబోవు ఎన్నికల్లో టీడీపీ అధికారం చేపట్టి చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా తెలిపారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 26వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రామయ్య, ప్రహ్లాద, పెద్దన్న, లక్ష్మీనారాయణ, కేశవ, సంజీవ్‌కుమార్, శివ, శ్రీను, మీరయ్య, షేక్ జహంగీర్ బాషా, మాచుపల్లె క్రిష్ణారెడ్డి, వీరారెడ్డి శివానందరెడ్డి పాల్గొన్నారు.

కాశినాయన..: ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిపథంలో నడిపించగల సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబేనని బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జారోశన్న పేర్కొన్నారు. ఆదివారం అమగంపల్లె,అక్కంపేట,కొట్టాలపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి,తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డి,టీడీపీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, దుగ్గిరెడ్డి,శ్రీనివాసులరెడ్డి,రోహిత్‌రెడ్డి,కిష్టయ్య, షరీఫ్,నాగరాజు, రఘురామిరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, అడవి రాముడు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలియో చుక్కలతో అంగవైకల్యం దూరం



జమ్మలమడుగులో పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శాంతికళ, కొండాపురం పీహెచ్‌సీలో పల్స్ పోలియో వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర రీజినల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

ప్రొద్దుటూరు ,మార్చి 3 : పోలియో రహిత సమాజం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ,కమిషనర్ రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక శ్రీరాముల పేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో పల్స్ పోలీయో కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. శ్రీరాముల పేటలోని పూర్ణ కోచింగ్ సెంటర్ వద్ద ఎమ్మెల్సీ రమేష్ యాదవ్,శ్రీరాముల పేటలోని కాన్పుల ఆసుపత్రిలో చైర్‌పర్సన్ భీముని పల్లె లక్ష్మీదేవి, పాత బస్టాండ వద్ద ప్రోగ్రాం అధికారి డా.శశిభూషణ్‌రెడ్డి,మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రఘునాధరెడ్డి, పవర్‌హౌస్ రోడ్డు అర్బన్ హెల్త్ సెంటర్‌లో డా.ఇలియారాణి, డా.శివప్రసాద్‌రెడ్డి ఉర్దు స్కూలు సెంటర్‌లో డా.నజీర్ బాషా ప్రారంభించారు. ప్రొద్దుటూరులో మొత్తం 19790 మంది టార్గెట్‌కు గాను 18732 మందికి పోలియో చుక్కలు వేసినట్లు అధికారులు తెలిపారు.

జమ్మలమడుగు..: పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం వలన అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చునని జమ్మలమడుగు మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శాంతికళ సూచించారు. ఆదివారం పాఠశాలల్లో, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయం, ప్రధాన సెంటర్లలో తదితర చోట్ల పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఖాదర్‌బాష, షమనాజ్, తాహిరా, వైద్య సిబ్బంది అంగన్వాడీ వర్కర్లు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, క్యాంబెల్ నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని తనిఖీ చేసిన రాష్ట్ర రీజనల్ డైరెక్టర్

కొండాపురం, మార్చి 3: మండలంలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని రాష్ట్ర రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ తనిఖీ చేశారు.ఓబన్నపేట వద్ద పల్స్ పోలియో కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అదేవిధంగా జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోరమ హైరిస్క్ పోలియో కేంద్రాలను,కొండాపురం రైల్వేస్టేషన్ పోలియో కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాంబశివారెడ్డి, సిబ్బంది ధనలక్ష్మి,కళావతి,మధు,మేరి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 93శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌ను తనిఖీ చేశారు. జిల్లా మలేరియా అధికారి మనోరమ బూత్‌లను పర్యవేక్షించారు.పీహెచ్‌సీ, అర్బన్ వైద్యులు జోత్స్న, ప్రియాంక, శ్రీనాథ్‌రెడ్డి, రూట్ సూపర్‌వైజర్లు, సీహెచ్‌వోలు, సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: మండలంలో 6406 మంది ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు పోలియో వ్యాక్సిన్ లక్ష్యంగా 75 పోలియో బూత్‌లలో వ్యాక్సిన్‌ను వేశారు. ఆదివారం పోరుమామిళ్ల మండలంలో 6278 మంది ఐదు సంవత్సరాల్లోపు పిల్లలు పోలియో వ్యాక్సిన్‌ను వేయించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రారంభించారు. అదనపు జిల్లా ఆరోగ్య అధికారి రవి, మెడికేర్ ఆఫీసర్లు మేరీ, శ్రీవిద్య, కరిష్మా నాగేంద్రబాబు, నాగలక్ష్మి ఆరోగ్యవిద్యాధికారి సాదు వెంకటేశ్వర్లులు పోలియో వ్యాక్సిన్ వేశారు. పోరుమామిళ్ల గ్రామ సచివాలయంలో సర్పంచ్ యనమల సుధాకర్ పిల్లలకు పోలియో వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమాల్లో హెల్త్ ఆఫీసరు నిర్మల, నాగమ్మ, మండల ఉపాధ్యక్షులు సీఎంబాషా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, టేకూరుపేట సర్పంచ్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: మండలంలోని అన్ని గ్రామాల్లో మొత్తం 4,502 మంది చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ రాజేష్ కుమార్ పేర్కొన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చాపాడులోని ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు చుక్కలు వేశారు. డాక్టర్లు ఓబులేసు, కావ్యమాధురి, సెంటర్లను పర్యవేక్షించారు.

ప్రొద్దుటూరు టౌన్..: పోలియో చుక్కలతో అంగవైకల్యం దూరం అవుతుందని వైద్యాధికారి డాక్టర్ దినేష్‌బాబు, కంటి వైద్యులు ఎం.ఎస్.తేజ పేర్కొన్నారు. ఆదివారం నందిని సూపర్‌మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో పోలియో చుక్కలు వేశారు. కాగా కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

బద్వేలు..: పోలియో రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని తొట్టి గారిపల్లె వైద్యాధికారి జ్యోత్స్న తెలిపారు. ఆదివారం బద్వేలు పట్టణంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని చేపట్టారు. చిన్నారుల తల్లిదండ్రులు తప్పక పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

గోపవరం..: పోలియో చుక్కలు భావితరాలకు వరమని మండల వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహజంచారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరు..: మైదుకూరు మండలంలో మొత్తం 97 శాతం పిల్లలకు పోలీయో చుక్కలు వేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేశ్ పేర్కొన్నారు. ఆదివారం ప్రధాన కూడళ్లతో పాటు పలు గ్రామాల్లో, సచివాలయాలల్లో పోలీయో కేంద్రాలను ఏర్పాటు చేసి సిబ్బంది ద్వారా చుక్కలు వేయించామని తెలిపారు. ఇంకా వేయించుకోని వారికి బస్టాండ్, ప్రధాన కూడళ్లల్లో సోమవారం పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



మైదుకూరులో పోలియో కేంద్రం వద్ద పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేశ్

బ్రహ్మంగారిమఠం..: బ్రహ్మంగారిమఠం మండలంలో 3617 మంది పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు చెన్నకేశవరావు, మహేష్ పేర్కొన్నారు. 96 శాతం పల్స్‌పోలియో నమోదు కావడం జరిగిందని వైద్యాధికారులు తెలిపారు.

ఖాజీపేట..: జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 77 బూత్‌లలో 5,663 మందికి పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 5,530 మంది చిన్నారులకు చుక్కలు వేశా మన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఆయేషా సుల్తా న్, ఎంపీహెచ్ ఈవో నాగభూషణం, పెంచల్‌రెడ్డి, సీహెచ్‌వోలు, ఎఎన్‌ఎంలు, ఆశాలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బద్వేలులో పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం

క్రమశిక్షణతో కూడినవిద్యను అలవరచుకోవాలి



తహసీల్దారు శిరీషను సన్మానిస్తున్న వెంగమాంబ హైస్కూలు యాజమాన్యం

పోరుమామిళ్ల, మార్చి 3 విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవరచుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని తహసీల్దారు శిరీష, ఎంఈవో కాశయ్య, అగ్నిమాపక కేంద్ర అధికారి నజీర్‌అహ్మద్, వెంగమాంబ ఇంగ్లీషు మీడియం హైస్కూలు ఛైర్మన్ పుల్లప్పనాయుడు అన్నారు. ఆదివారం వెంగమాంబ ఇంగ్లీషు మీడియం స్కూలు 20 వార్షికోత్సవ వేడుకల్లసందర్భంగా పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పరీక్షలకు వత్తిడికి గురి కాకుండా ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు, ఎంఈవో, అగ్నిమాపక కేంద్రం అధికారి, రచయిత బొల్లు రామ్మోహన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దిలీప్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ ఆఫీసరు నాగలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపిక

కొండాపురం, మార్చి 3: స్థానిక వివేకానంద పాఠశాలలో 5 వతరగతి చదువుతున్న మోక్షిత అనే విద్యార్థిని ఆదివారం కడపలో జరిగిన అబాకస్ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికయింది.ఈ విద్యార్థి జిల్లా స్థాయిలో రెండో బహుమతి సాధించింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల కరస్పాండెండ్ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు.అదేవిధంగా 2 వతరగతి చదువుచున్న హన్‌విద్‌రెడ్డి, శాన్విత్‌రెడ్డి జిల్లాస్థాయిలో 3 వ బహుమతి పొందినట్లు ఆయన తెలిపారు.



బహుమతి అందుకుంటున్న మోక్షిత

తిమ్మాయపల్లెలో పెద్దమ్మతల్లి వార్షికోత్సవం

మైదుకూరు, మార్చి 3 : మైదుకూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాయపల్లెలో మంగళవారం పెద్దమ్మతల్లి 14వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో ఉదయం అమ్మవారికి పూజా కార్యక్రమాల అనంతరం న్యూ కేటగిరి వృషభాలచే బండలాగుడు పోటీలు నిర్వహించి, గెలుపొందిన వృషభ యజమానులకు 10 వేల నుంచి 50 వేల వరకు నగదు బహుమతులు ఇవ్వనున్నారు. కాగా కోలాటంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని, భక్తులకు అన్న ప్రసాదం ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

మొల్ల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

గోపవరం, మార్చి 3: కవయిత్రి మొల్ల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. గోపవరం సమీపాన ఉన్న మొల్ల మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న సాహితీసభ నిర్వహిస్తామన్నారు. 8న బద్వేలు, 9న ప్రొద్దుటూరు, 10న రాజంపేట, 11న జమ్మలమడుగు, 12న పులివెందుల, 13న కడపలో మొల్ల సభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడిగా ఇమ్మానుయేల్

పోరుమామిళ్ల, మార్చి 3 : దళిత హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడిగా బద్వేలుకు చెందిన నాగదాసరి ఇమ్మానుయేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆదివారం ఆయన తెలిపారు. శనివారం కడప హోచిమన్ భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సమావేశంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేస్తామని ఆయన తెలిపారు.

వివాహ వేడుకలకు హాజరైన పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, మార్చి 3 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో ఆదివారం బేస్తవారిపేట పూజారి కుమారుడి వివాహ మహోత్సవానికి మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారిమఠం మండలం టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఉన్నారు.



రేషన్ బియ్యం డీలర్ల ఇంటి వద్దనే పంపిణీ

- మూన్నాళ్ల ముచ్చటగా వాహనాల్లో బియ్యం పంపిణీ

జమ్మలమడుగు, మార్చి 3: జమ్మలమడుగు పట్టణంలో జగనన్న వాహనాల్లో బియ్యం పంపిణీ మూన్నాళ్ల ముచ్చటగా మారింది. గత నెలలో రేషన్ బియ్యం కొందరు డీలర్లు జగనన్న ఆటోలలో బియ్యాన్ని ఇంటి వద్దకు తెచ్చి పంపిణీ చేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని రెండు నెలల నుంచి డీలర్లకు, వాహనదారులకు అధికారులు హెచ్చరికలు చేసి బియ్యం పంపిణీ చేసినా ప్రస్తుతం కొందరు డీలర్లు తమ ఇంటి వద్ద, మరికొందరు రూము బాడుగకు తీసుకుని అక్కడే రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. డీలర్ వద్దకు వచ్చి బియ్యం కోసం రోడ్డు పక్కనే గంటలకొద్ది నిలబడి తీసుకుని వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. అందులో భాగంగా జమ్మలమడుగు పట్టణంలోని గౌషియా మకాన్, గౌషియా షాదీఖానా మధ్య రోడ్డు పక్కన ఓ ఇంటిలో 18వ వార్డుకు సంబంధించి బియ్యం పంపిణీ చేస్తున్నట్లు అక్కడ నిలబడి ఉన్న లబ్ధిదారులు తెలిపారు.



ఇంటి వద్ద రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

డీఎస్పీ వంశీధర్‌గౌడ్ బదిలీ

మైదుకూరు, మార్చి 3 :మైదుకూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వంశీధర్‌గౌడ్ ఆదివారం బదిలీ అయ్యారు. ఆయన కమిషనర్‌రేట్ పరిధిలోని ట్రాఫిక్‌కు బదిలీ కాగా అక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లును మైదుకూరు డీఎస్పీగా బదిలీపై రానున్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనలో వైసీపీ విఫలం

బద్వేలు, మార్చి 3: యువతకు ఉద్యోగాలు కల్పించడంలో వైసీపీ పూర్తిగా విఫలమైందని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న తెలిపారు . ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో రాష్ట్రంలో నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులను మభ్య పెట్టేందుకు డీఎస్సీ ప్రకటన విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, నరసింహాలు తదితరులు పాల్గొన్నారు.

వై.కోడూరులో పోలీసుల పల్లెనిద్ర

ఎర్రగుంట్ల, మార్చి 3: ఎర్రగుంట్ల మండలంలోని వై.కోడూరు గ్రామంలో ఎర్రగుంట్ల అర్బన్ సీఐ ఈశ్వర్యయ్య ఆధ్వర్యంలోని పోలీసు బృందం ఆదివారం రాత్రి పల్లెనిద్ర ఏర్పాటు చేశారు. గ్రామంలోని అన్ని వీధుల్లో కలియతిరిగారు. అలాగే స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి సమస్యలున్నా తమదృష్టికి తీసుకురావాలని సీఐ ఈశ్వరయ్య గ్రామ ప్రజలకు సూచనలిచ్చారు. రాత్రి అక్కడే బసచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ చిరంజీవి, పోలీసు బృందం పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలి

పోరుమామిళ్ల, మార్చి 3 : ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అన్నాఉ.ఆదివారం రాత్రి మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లెలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నికల సమయంలో గ్రూపులు, వర్గాలు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. కొత్తవ్యక్తులు ఎవరైనా గ్రామంలో తారసపడితే తమ దృష్టికి తేవాలన్నారు. బెల్టు షాపులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేస్తే చ్యర్యలు కఠినంగా ఉంటాయన్నారు.

ఓసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా సురేంద్రరెడ్డి

మైదుకూరు, మార్చి 3 : మైదుకూరు నియోజకవర్గ ఓసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మండలంలోని జాండ్లవరానికి చెందిన ముత్యాల సురేంద్రరెడ్డిని నియమించినట్లు ఓసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం కడపలో జరిగిన జరిగిన సమావేశంలో సురేంద్రరెడ్డికి జిల్లా అధ్యక్షురాలు వేమిరెడ్డి యమునారెడ్డి నియామక పత్రం అందచేశారు.

ఘనంగా త్రిమూర్తి శివజయంతి మహోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 3: ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం స్థాపించి 88 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఓంశాంతి భవన్‌లో త్రిమూర్తి శివజయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం విజయనగరం వీధిలోని ఓంశాంతి భవన్‌లో శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, ధ్యానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు బి.కె.శాంత, బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.



శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం